# 12

# కరణంగారి కథ

కరణం రామయ్యగారు నిలువునా నీరైపోయినాడు. నిజంగా ఆయనకు రావలసిన కష్టంకాదిది. రావలసినవారికి రాదగిన కష్టాలు రావడంలో విచిత్ర మేముంటుందీ?

రామయ్యగారిది పెద్ద సంసారం. ఆయనసంసార మంతా కరణీకంమీదనే వెళ్ళమారుతున్న దనగల సాహసం మావూళ్ళో ఎవరికీ లేదు. ఒకనాడు...అదే ముప్ఫయి సంవత్సరాల కిందటిసంగతి...

మానాన్న అన్నదమ్ములు ఆరుగురికీ పంపిణీలదగ్గర పెద్ద తగాదా వచ్చింది. మా పెద్దనాన్న - అంటే మానాన్న పెద్ద అన్నగారు మాతాత తరువాత కొంతకాలం సొంత సేద్యం చేశాడట. కలిసి రాలేదట. వంద ఎకరాల పొలం కాస్తా నలభై ఎకరాలయింది. అందుకని ఆయనకు వాటా ఇయ్యడానికి వీల్లేదంటారు మిగతా తమ్ముళ్ళు. "అదేమన్న మాట? వాడికీ పిల్లలున్నారు. ఇంతవరకూ అందరం కలిసే ఉన్నాం - సొంతసేద్యం కలిసివచ్చి ఉంటే లాభంలో వాటా అడిగేవాళ్ళ మేగదా! నష్టంమాత్రం ఎందుకు పంచుకో

రాదూ ?'' అని మానాన్న వాదన. చినికి చినికి గాలివాన అయింది తగాదా. నాలుగు రోజులయినా తెమలదు.

ఊళ్లో కల్లా పెద్దకుటుంబంలో ఇట్లా తగాదా రావడం ఊరంతటికీ సంతోషమే. అయితే ఆమాట పైకి అనరు. 'ఏమిటి బావా సంగతి' అని సానుభూతి చూపించడానికి వచ్చినట్టు వచ్చి నెమ్మదిగా ఉన్నవీ లేనివీ కలిపించి ఊరంతా ప్రచారం చేస్తారు. నాలుగురోజులు ఇంట్లో ఇంతగోల జరుగుతున్నా మా తాత పెదిమ కదల్చలేదు. తనకు మాత్రం వాటా వద్దన్నాడు. ఆయనంటే ఊళ్ళో అందరికీ గౌరవం. అంతకు రెండు సంవత్సరాలకిందటినుంచే ఆయనభోజనం, నిద్ర ఊళ్ళో ఎక్కడ పడితే అక్కడే జరుగుతున్నవి.

స్వయంగా వళ్ళువంచి దున్నలతో సేద్యంచేసి యాభై ఎకరాల మాగాణిని వందఎకరాలు చేసిన రైతు మా తాత. ఊళ్ళోశివాలయం శిథిలావస్థలో ఉంటే స్వయంగా రాయితీయించి, ఖర్చుభరించి, దమ్మిడీచందా వసూలు చేయకుండా దేవాలయాన్ని పునరుద్ధరించిన దాత మా తాత. ''వద్దు, నామాట విను. సొంతసేద్యం ఇక కలిసి రాదు'' అని ఆయన ఎంతచెప్పినా వినకుండా పెద్దకొడుకు సొంతసేద్యం చేస్తుంటే ఊరుకున్న కర్మిష్ఠి మా తాత.

తాత తరువాత ఊళ్ళోపెద్దవాడు కరణం రామయ్యగారు. ఆయనకు ఎప్పుడు ఏమికావలసినా మా యింటినుంచి వెళ్తూండేవి. తాతకు ఏపనిలో ఎటువంటి సహాయం కావలసినా కరణం రామయ్యగారూ, ఆయన తాలూకు మను

షులూ ప్రత్యక్షం. అటువంటి కరణంగారితో నైనా, తాత, సంగతి చెప్పలేదు. ఆ తరం మనుషుల ప్రవృత్తే అది. నా కొడుకులు, పంపిణీలు తెమలక, కీచులాడుకుంటున్నా రని తాత చెప్పలేదు. వారూ వీరూ వదంతిగా చెప్పుకుంటున్నా, "సంగ తేమిటి బావా" అని ఆయన అడగనూ లేదు.

అయిదో రోజున నాన్న వెళ్ళి కరణం రామయ్య గారికి సంగతంతా చెప్పి "నువ్వు వచ్చి వ్యవహారం తేల్చు మామా" అన్నాడు. అంతే. రామయ్యగారువచ్చి తగాదా అంతా సరిచేశాడు. పెద్దనాన్నకూ అందరితోపాటు పొలం లోనూ, ఇంట్లోనూ వాటా వచ్చింది. నాయనమ్మకు ఒక్కొక్క సంవత్సరం ఒక్కొక్కరు పుట్టి గింజలు ఇచ్చేట్టూ, మిగతావాళ్లు సంవత్సరానికి వందరూపాయ లిచ్చేట్టూ ఏర్పాటు చేశారు.

ఎందుకు చెప్పానంటే, ఇటువంటి పంపిణీ లెన్నో కర ణంగారు చేయించారు. కాని, ఆయన పరిస్థితిలో మాత్రం మార్పు లేదు. అయిదెకరాల మాగాణి ఉన్నది. పూర్వీకుల కొంప ఒకటి ఉన్నది. వాటితోనే ఆయన ఇద్దరు మగపిల్ల లకూ బియ్యేదాకా చెప్పించాడు; ఇద్దరు ఆడపిల్లలకు పెద్ద పెద్ద కట్నాలిచ్చి పెండ్లిచేశాడు. చెయ్యిజాపి ఇతర్లను దమ్మిడీ అడగకుండా నలభైసంవత్సరాలు గడిపిన కరణం రామయ్యగారికి ఈనాడు పెద్ద చిక్కే వచ్చింది...

కొడుకులు పెద్దపెద్ద ఉద్యోగాలలో ఉన్నారు. అల్లుళ్లు కూడా ఉద్యోగాలు చేస్తున్నారు. భార్య పోయింది.

అయినా కరణంగారు వూరు వదిలిపెట్టలేదు. తనే అన్నం వండుకుంటాడు. రెవిన్యూ ఇన్‌స్పెక్టరు దగ్గరనుంచి జిల్లా కలెక్టరుదాకా ఏ పెద్ద ఉద్యోగి వచ్చినా నీరుకావిధోవతి, అంగవస్త్రంతో తయారవుతాడు. అడిగినవాటికి సమాధానం చెప్తాడు. తెలియని సంగతులు తెలుసుకుంటానంటాడే గాని అధికారులతో సమంగా రైతులపై పెత్తనం చెయ్యడు.

ఆయనను చూస్తే అధికారులకు గౌరవమో, భయమో, ఆదరణో, సానుభూతో తెలియదు కాని ఇన్ని సంవత్సరాల జీవితంలో ఆయనను ఎవరూ పల్లెత్తు మాట అనలేదు. ఇంత నిజాయితీగల మనిషిగా పేరందిన కరణం గారిపై ఫోర్జరీకేసు రావడం విచిత్రం కాదూ!! అందులోనూ జమీందారు పొలం తనఖా వ్యవహారం తాలూకు ఫోర్జరీ.

ఇప్పటి జమీందారుకు కరణంగారంటే అభిమానమో, కోపమో తెలియదు. పూర్వపు జమీందారు మాత్రం "కరణం రామయ్య మామూలు మనిషి కాదయ్యా" అనేవాడట.

నా దురదృష్టమేమో! చిన్నతనంనుంచీ నిప్పువంటి మనిషి అనుకున్న కరణంగారి కేసు నేను మేజస్ట్రేట్‌గా ఉన్న ఊళ్ళోనే విచారణకు వచ్చింది. కరణంగారి దస్తూరి నాదగ్గర ఉన్నది. నాన్నలావాదేవీలన్నీ కరణంగారే చాలా కాలం చేశారు.

ఆయనదస్తూరిని నేను సులభంగా గుర్తుపట్టగలను. కోర్టులో దాఖలయిన దస్తావేజు దస్తూరీ ఆయనది కానే కాదు.

గిట్టనివా ళ్ళెవరో ఆటగాయితనానికి కుర్రజమీం దారుచేత ఈపని చేయించిఉంటారనుకున్నాను. దస్తూరీ

పరీక్షకు పంపిస్తే సరి, కేసు తేలిపోతుంది. ఆయనకు వచ్చిన ప్రమాదం ఏమిటి లెమ్మని ఊరడిల్లాను.

రెండు నెలల విచారణ తరువాత కేసును సెషన్సుకు పంపించాం. నాకు కలిగిన బాధను మాటలువర్ణించ లేవు. ఆయన నేరం చెయ్య లేదని నానమ్మకం. దస్తూరికూడా పోలిక లేదు. అయినా వారి పట్టుదల కారణంగా దస్తూరిని పరీక్షకు పంపాం. ఇంకా యేం, కరణంగారు నిర్దోషిఅని ఋజువవుతుంది లెమ్మని చాలా సంతోషించాను. కాని, నా సంతోషం ఎక్కువకాలం నిలవ లేదు. దస్తూరి కరణంగారిదేనని పరిశీల కులు నిర్ణయించారు. పిడుగు పడ్డంత బాధపడ్డాను.

తండ్రి ఇంత కష్టంలో ఉన్నా ఒక్క కొడుకైనా కరణంగారిని ఆదుకోలేదు. ఆయనకు ముఖంకూడా చూపించ లేదు. కూతుళ్లుమాత్రం వచ్చి వెళ్లారు.

"అయ్యో...మీకు ఇంత కష్టంవచ్చిందా" అని ఆ వృద్ధుణ్ణి అడిగే ఆత్మీయులే లేకపోయినారు. ఊరుకూడా చాలా మారింది. అందరూ జమీందారుపక్షమే.

ఇంకొక విచిత్రమేమిటంటే, ఈ కేసు నేను అనుకు న్నంతగా కరణంగారిని బాధపెడ్తున్నట్లు కనిపించదు. ఆయన దినచర్యలో మార్పులేదు. "బాబూ...నాకు సహాయం చెయ్యండి" అని ఎవరినీ ఆయన అడగలేదు. పేరుకు ఒక ప్లీడర్ను పెట్టాడు. జరగవలసిందేమో జరుగుతుంది. బాధ ఎందుకూ ? బాధపడితే చిక్కు పరిష్కార మవుతుందా యేం అన్న ధోరణిలో ఉన్నది కరణంగారి తీరు.

సెషన్సు విచారణకూడా మూడునెలల్లో తేలింది. కరణంగారు దోషి అనే నిర్ధారించారు.

ఆ ఆరునెలల్లో చాలామార్పులు వచ్చినవి. అనేక కారణాలవల్ల నేను ఉద్యోగంలోనుంచి తప్పుకున్నాను. కరణంగారు దోషి అని సెషన్సుకోర్టు తీర్పు చెప్పిందని తెలిసి వెంటనే హైకోర్టులో అప్పీలు దాఖలుచేయించి జామీనుపై ఆయనను వదిలించుకు వచ్చాను.

ఆతరువాత జరిగింది చెప్పడం అనవసరం......... బాధే తప్ప సంతోషించదగ్గ విషయమేమీ అందులోలేదు.

అయితే ఈనాటికీ నాకు అర్థంకాని సంగతొకటి. హైకోర్టుకూడా కరణంగారు దోషి అనే తీర్పు చెప్పింది... అయినా నాదృష్టిలో కరణంగారు నిర్దోషి. కల్లకపటాలు తెలియని మనిషి. ఎక్కడో యేదో పొరపాటు జరిగింది. దాని ఫలితం కరణంగారు అనుభవించవలసి వచ్చింది......

ఇదే విషయం ఎన్నిసార్లు అడిగినా నవ్వి ఊరుకోడం తప్ప కరణంగారు ఎవరినీ తిట్టలేదు. నేను ఏ పాపమూ ఎరగనని మొరపెట్టలేదు...

కరణంగారు జైల్లో చనిపోయాడు. తమాషా యేమిటో తెలియదు. జరిగిందంతా పొరపాటనీ, తప్పంతా తనదేననీ జమీందారు హైకోర్టుకు అర్జీపెట్టాడు. ఏమి ప్రయోజనం ??...